
**ఓ పరాధీన మానవా! ఓపరాని**
**దాస్యము, విడల్చలేని శాంతము మాని**
**తలుపులను ముష్టిబంధానకలచివైచి**
**చొచ్చుకొని పొమ్ము స్వాతంత్ర్య సురపురమ్ము**

కాలిపోయిన పందిళ్ల బూడిద వేడిగా అరికాళ్లకు తగులుతూ ఉండగా నిర్భయంగా, విప్లవ శంఖారావంలా పద్యాలు చదువుడు ప్రారంభించిండు.

స్వాతంత్ర్య సురపురానికి బాటలు తీస్తున్న ఆ యువకవిని అమాంతం కౌగిలించుకున్నారు సురవరం. మెడలో పుష్పహారం వేశారు. ఆనందబాష్పాలు కదులుతుండగా ఆ యువకవి భుజాలపై చేతులు వేసి నొక్కుతూ 'సింహగర్జన చేశావు నాయనా' అన్నారు.

అగ్నిధార అయి వర్షించిన ఆ యువ కవి కంఠీరవం పేరు దాశరథి.

***


యువ కవి





తెలంగాణ విప్లవ శరధిలో ఎగిసిపడిన కవిత్వ తరంగం దాశరథి.

సంక్షోభ సందర్భాన్ని ధిక్కరించిన కల్లోల కాల గీతికలతో, దేశీ కవితకు ఉర్దూ, పారశీకపు మనోహర భావనలు అద్దిన రస వద్వీచికలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన భావుకుడు, పండితుడు, విప్లవకారుడు, అనువాదకుడు, ఆకాశవాణి ప్రయోక్త, విఖ్యాత సినీ గీత రచయిత దాశరథి.

తెలంగాణను ఆత్మలో ప్రతిష్ఠించుకున్న అరుదైన కవి. ఆయన కవిత్వంలో తెలంగాణ అస్తిత్వం పురివిప్పి నర్తించింది. నిజాం పరిపాలనలో కళపెళ ఉడికిన కాలానికి అక్షరానువాదమై నిలిచింది ఆయన కవిత్వం.

జైలు గోడల మీద బొగ్గుముక్కతో ఆయన రాసిన 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అజరామరమై నేటికీ స్ఫూర్తినందిస్తున్నది. తెలంగాణ ప్రజల తలపుల్లో జ్వలిస్తూనే ఉన్నది. తెలంగాణ మలిదశ ఉద్యమానికి సైతం మకుటాయమానంగా నిలిచి ప్రేరణనిచ్చింది. దాశరథి శత జయంతి ఉత్సవాలను ప్రారంభించుకుంటున్న వేళలో.. ఆయన సమున్నత సాహిత్య జీవన ప్రస్థానాన్ని సముజ్వలంగా స్మరించుకోవాలి. ఆయన చూపిన దారిలో అన్నార్తులు అనాథలుండని నవయుగాన్ని నిర్మించుకోవాలి..

**ఇంట్ల నుంచే ధిక్కారం**

దాశరథి పూర్తిపేరు దాశరథి కృష్ణమాచార్య. అయితే, దాశరథి అనే ఇంటిపేరుతోనే ఆయన ప్రసిద్ధుడు. 1925 జూలై 22న, ఆనాటి వరంగల్ జిల్లా... ఇప్పటి మహబూబాబాద్ జిల్లాలోని చినగూడూరు గ్రామంలో జన్మించారు. 'నా బాల్యం నుంచే ఇంటా బయటా మా మాతృభాష మీద దండయాత్రలు జరిగాయి' అని ఆయన చెప్పుకొన్నారు.

నాటి నిజాం ప్రభుత్వం ఉర్దూను బోధన భాషగా నిర్ణయించింది.. ఇక ఇంట్లో దాశరథి వాళ్ల నాన్నగారు సంస్కృత భాషాధిక్యాన్ని గురించి చెబుతుండేవారు. స్నానం చేసి మడి కట్టుకుంటే సంస్కృతంలోనే మాట్లాడేవారు. తెలుగులో మాట్లాడితే మైలపడిపోతానేమో అని భయపడే ఛాందసుడాయన. అయితే, దాశరథికి సంస్కృతం మీద గౌరవమే కాని, తండ్రి ఛాందసం నచ్చేది కాదు. అలా దాశరథిలో బాల్యం నుంచే ధిక్కారం మొగ్గ తొడిగింది. తెలుగును నేర్చుకోవటం ఆయన చేసిన తొలి ధిక్కారం. తల్లి వేంకటమ్మ దగ్గర తెలుగు కావ్యాలతో పాటూ హృదయ సౌకుమార్యాన్ని, తండ్రి నుంచి పాండితీ లక్షణాన్నీ పుణికిపుచ్చుకున్నారు. చినగూడూరు ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి పూర్తిచేశారు. ఆ తరువాత చదువు నిమిత్తం ఖమ్మం వెళ్లాల్సి వచ్చింది. మాధ్యమికోన్నత విద్యాభ్యాసం అక్కడి ఉస్మానియా హైస్కూల్లో జరిగింది. ఆ పాఠశాలలోనే డి.రామలింగం, ఎం.ఎల్.నరసింహారావు, హీరాలాల్ మోరియా మొదలైనవారు దాశరథికి మిత్రులయ్యారు. స్వాభిమాన సంపన్నుడైన దాశరథి దారిద్ర్య బాధలకు ఖిన్నుడైపోలేదు. ఏడో తరగతి చదువుతున్నప్పటి నుంచీ తోటి విద్యార్థులకు ఆంగ్ల వ్యాకరణం, ఉర్దూ ట్యూషన్ చెప్పి ఆ డబ్బులతో అవసరాలు గడుపుకొనేవారు.



**బడిలోనూ ధిక్కారమే**

తా అబద్బాలిఖే ఆలంయే రియాసత్ రఖ్ఖే
తుజ్ కో ఉస్మాన్ బసాద్ ఇజ్లాల్సలామత్ రఖ్ఖే

ప్రపంచ సృష్టికర్త ప్రళయం వరకూ ఈ రాజ్యాన్ని సుస్థిరంగా ఉంచనీ/ ఓ ఉస్మాన్! నిన్ను నిండుదర్పంతో క్షేమంగా ఉంచనీ... అనే పల్లవితో సాగే ప్రార్థనా గీతం దాశరథికి నచ్చలేదు. అది ఆలపించలేక ప్రధానోపాధ్యాయుడి చేత దెబ్బలు తిన్నడు. అయితే అతని ధిక్కారం రాజు మీదనే ... ఉర్దూ భాష మీద ఆయనకు ద్వేషం లేదు. పైగా ఉర్దూ మనోహరత్వం మీద అనంతమైన వ్యామోహం. ఆర్య సామాజికుడైన కేశవార్య శాస్త్రి ఉపనిషత్ సూక్తులూ, బడిలో జక్కీసాబ్ చెప్పిన ఇక్బాల్ కవితలతో బాల దాశరథిలో విప్లవాగ్ని జ్వాల రగిలింది. ఏ నేలలో ఉదయించిన కవి ఆ నేల స్వభావాన్ని ప్రతిఫలించటం సహజమే కదా!

***

బ్రాహ్మణేతరుడైన కేశవయ్య వేదాధ్యయనం చేసి కేశవార్య శాస్త్రిగా మారేలా చేసింది ఆర్యసమాజం. ఐతరేయోపనిషత్తులోని 'అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్' అనే సూక్తికి ఆయన చెప్పిన అర్థం బాల దాశరథిని ప్రభావితం చేసింది. 'భగవంతుని నోటిలోనికి అగ్ని ఎట్ల ప్రవేశించింది'? కాలదా?' దాశరథి అమాయక ప్రశ్న. 'శబ్దం రూపంలో ప్రవేశిస్తుంది కనుక కాలదు, పైగా ఇతరుల గుండెల్లోని అజ్ఞానాన్ని కాలుస్తుందని కేశవార్య శాస్త్రి చెప్పిన సమాధానం, దాశరథిలో ఆనాడే అగ్నిబీజాన్ని నాటింది, ఆ బీజమే భవిష్యత్తులో 'అగ్నిధార'గా మారింది.

ఇక మదర్సాకు పోతే జనాబ్ జక్కీ సాహెబ్ చెప్పిన అల్లామా ఇక్బాల్ కవితలు దాశరథిలోని అగ్నిని విప్లవాగ్నిగా మార్చివేశాయి. జిస్ఖేత్సే దహ్ఖాకుమయస్సర్నహీ రోజీ/ ఉస్ ఖేత్ కె హర్ఖూషయెగందుంకుజలాదో... ఏ పొలమున నిరుపేదకు తిండి దొరకదో/ ఆ పొలమున గల పంటను కాల్చేయండి.. అనే పంక్తులలోని భావం దాశరథి హృదయం మీద ప్రగాఢ ప్రభావం చూపింది. అది ఆజీవ పర్యంతం వెన్నాడింది. బహుశా బాల్యంలోని ఆ ప్రేరణలోంచే అగ్నిధారలోని ఈ చారిత్రక పద్యం ఉద్భవించిందేమో!?

**ప్రాణములొడ్డి, ఘోర గహనాటవులన్**
**బడగొట్టి, మంచి మా**
**గాణములన్ సృజించి, ఎముకల్ నుసిచేసి,**
**పొలాలదున్ని, భో**
**షాణములన్ నవాబునకు స్వర్ణము**
**నింపిన రైతుదే; తెలం**
**గాణము రైతుదే; ముసలినక్కకు**
**రాచరికంబు దక్కునే**

దేశం అంటే మనుషులని గురజాడ అంటే, రైతుల నెత్తురు చెమటలతోనే రాచరిక వైభోగాలనీ, కనుక దేశం రైతుదేననీ దాశరథి ప్రకటించారు.

**సాహిత్యం-ఉద్యమం**

1930-40 దశకాలలో తెలంగాణ భూస్వామ్య సమాజంలో ఒక కొత్త వెల్లువ పెల్లుబుకింది. ఒక నూతన పరివర్తన రూపుదిద్దుకున్నది. గ్రంథాలయోద్యమం, ఆర్యసమాజ స్థాపన, ఆంధ్ర మహాసభ ఆవిర్భావం, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పాటు, కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం... ఇలా తెలంగాణలో అనేక దారులు విచ్చుకున్నాయి. భిన్న భావాలు ఘర్షించుకున్నాయి. స్వాతం